

అల్ట్రాసౌండ్ లేదు..!

సామాజిక ఆరోగ్య కేంద్రంలో నిలిచిపోయిన పరీక్షలు

నిరాశతో వెనుదిరుగుతున్న గర్భిణులు.. ఆర్థిక భారమని గగ్గోలు

పట్టించుకోని వైద్య విధాన్ పరిషత్ అధికారులు, ప్రజాప్రతినిధులు

... వివరాలు 8వ పేజీలో

గంజాయి కంపు వదిలేనా..?



ఏజెన్సీలో గంజాయి మొక్కలు

దేశంలో ఎక్కడ గంజాయి పట్టుబడినా మూలాలు విశాఖ మన్యంలోనే..

- పాలకుల నిర్లక్ష్యంతో జరగని నిర్మూలన
- పోలీస్ శాఖ ప్రత్యేక శ్రద్ధతోనే శాశ్వత నిర్మూలన
- గంజాయిపై సర్కారు ఉక్కుపాదం మోపితేనే ఫలితం
- ఒడిశా సరిహద్దులో గంజాయి సాగు

(పాడేరు-ఆంధ్రజ్యోతి)

మన్యానికి గంజాయి కంపు పూర్తి స్థాయిలో ఎప్పుడు వదులుతుందోనన్నది జవాబు దొరకని ప్రశ్నగా మారింది. దేశంలో ఎక్కడ గంజాయి పట్టుబడినా దాని మూలలు విశాఖ ఏజెన్సీలోనే అన్నది వెల్లడవుతున్నది. వాస్తవానికి పోలీసులు పూర్తి స్థాయిలో దృష్టి సారిస్తే గంజాయి శాశ్వత నిర్మూలన సాధ్యంకాని పనికాదు. కాని క్షేత్ర స్థాయిలో వాస్తవ పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. గంజాయి సాగు అందరికీ ఆదాయ వనరుగా మారడమే శాశ్వతనిర్మూలనకు ప్రధాన అడ్డంకి అయ్యింది. ఈ తరుణంలో తాజాగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం గంజాయి, మత్తు పదార్థాలపై ఉక్కుపాదం మోపి శాశ్వతంగా నిర్మూలిస్తామని ప్రకటిస్తుండడంతో మన్యంలో గంజాయి అంశం ప్రస్తుతం చర్చనీయాంశమైంది.

ఏజెన్సీలో జీకేవీధి, జి.మాడుగుల, పెదబయలు, ముంచంగిపుట్టు, హుకుంపేట, చింతపల్లి మండలాల్లో ఒడిశాకు ఆనుకుని ఉన్నాయి. ఆయా మండలాల్లోని మారుమూల గ్రామాల్లో అధిక విస్తీర్ణంలో గంజాయిని సాగు చేస్తున్నారు. అలాగే విశాఖ ఏజెన్సీకి ఆనుకొని ఒడిశాలో ఉన్న గిరి పల్లెల్లో పది వేల ఎకరాల్లో గంజాయిని సాగు చేస్తున్నారనేది అనధికారిక అంచనా. తమిళనాడుకు చెందిన గంజాయి వర్తకుల ఆర్థిక సాయంతో స్థానిక గిరిజనులే ఆయా ప్రాంతాల్లో గంజాయి సాగు చేస్తున్నారు. అలాగే గంజాయి సాగు చేసే గిరిజనులకు, స్మగ్లర్లకు అటు మావోయిస్టులు, ఇటు పోలీసులు సంపూర్ణంగా సహకరిస్తుండడంతో ఆయా ప్రాంతాల్లో మామూలు పంటలు మాదిరిగానే గంజాయి సాగు చేస్తున్నారనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. అలాగే ఆయా ప్రాంతాలకు స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంట్ బ్యూరో సిబ్బంది వచ్చే పరిస్థితులు ఉండవు. దీంతో ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఆధునిక పద్ధతుల్లో గంజాయి సాగు చేస్తున్నారు. నూటికి నూరు శాతం ఒడిశాను ఆనుకుని వున్న మావోయిస్టుల ప్రభావిత మారుమూల గిరిజన ప్రాంతాల్లో మాత్రమే గంజాయిని సాగు చేస్తున్నారు. ఆయా ప్రాంతాలకు మావోయిస్టులు, పోలీసులు మినహా ఇతరులు వచ్చే అవకాశం లేదు. దీంతో వారి సాగుకు ఎటువంటి సమస్యలు తలెత్తడం లేదు.



ఎండు గంజాయి



గంజాయి ప్యాకెట్‌లు

పోలీస్ శాఖ ప్రత్యేక శ్రద్ధతోనే శాశ్వత నిర్మూలన

ఏజెన్సీలో గంజాయి నిర్మూలనకు ఎన్ని సంయుక్త దాడులు చేపట్టినా ఆశించిన స్థాయిలో లక్ష్యం సాధించడం కష్టమనే వాదన చాలా కాలంగా వినిపిస్తున్నది. పోలీస్ యంత్రాంగం ప్రత్యేక శ్రద్ధ కనబరిచి, అక్రమ రవాణా, స్మగ్లర్ల కదలికపై దృష్టి సారిస్తేనే గంజాయిని శాశ్వతంగా నిర్మూలించగలరని స్పష్టమవుతున్నది. ప్రధానంగా ఏజెన్సీ 11 మండలాల పరిధిలో పాడేరు, అరకులోయ, చింతపల్లిలో మాత్రమే ఎస్‌ఈబీ స్టేషన్లు ఉన్నాయి. అదే పోలీసుల విషయానికి వచ్చే.. 11 మండలాల్లో 14 పోలీస్‌స్టేషన్లు, జి.మాడుగుల మండలం నుర్మతి, పెదబయలు మండలం రూడకోట, చింతపల్లి మండలం మూలగరువు కొత్తూరులో పోలీస్ అవుట్ పోస్టులున్నాయి. అలాగే ఎస్‌ఈబీతో పోలిస్తే రెట్టింపు స్థాయిలో సిబ్బంది, అదనంగా సీఆర్‌పీఎఫ్ బలగాలు ఉన్నాయి. దీంతో ఏజెన్సీ ప్రాంతం నుంచి ఇతర ప్రాంతాలకు గంజాయి అక్రమ రవాణాను అరికట్ట గల అవకాశం కేవలం పోలీసులకు మాత్రమే ఉంది. దీంతో గంజాయి అక్రమ రవాణాను శాశ్వతంగా నిర్మూలించాలని పోలీసులు సంకల్పిస్తే, కచ్చితంగా అడ్డుకోగలుగుతారు. కాని పోలీసులు అందుకు భిన్నంగా తమకు ఉన్నతాధికారుల నుంచి ఒత్తిడులు వచ్చినపుడు మాత్రమే కొంతవరకు గంజాయిని పట్టుకుని, మిగిలిన సమయాల్లో స్మగ్లర్లకు సహకరిస్తున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. అలాగే ఏజెన్సీలో, మైదాన ప్రాంతాల్లో ఉన్న గంజాయి స్మగ్లర్ల వివరాలు పోలీసులకు తెలియనిది కాదు. ప్రధానంగా గంజాయిని తరచూ అక్రమ రవాణా చేస్తున్న వారిపై పోలీసులు కనీసం దృష్టి సారించడం లేదని విమర్శలున్నాయి. గతంలో పేరున్న గంజాయి స్మగ్లర్లతో పోలీసులు కుమ్మక్కై, వారికి చెందిన గంజాయి పట్టుబడినా, ఆయా కేసుల్లో వాహనాలు నడిపే డ్రైవర్లు, పైలట్‌లుగా వ్యవహరించే యువకులనే నేరస్తులుగా చూపిస్తూ, అసలు స్మగ్లర్లను సహకరిస్తున్నారనే వాదన ఉంది. అలాగే ఏజెన్సీ ప్రాంతం నుంచి జిల్లాలు, రాష్ట్రాలు దాటి గంజాయి అక్రమ రవాణా జరుగుతుందంటే, స్థానికంగా ... మిగతా 8వ పేజీలో



'సంపూర్ణత అభియాన్' పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ దినేశ్‌కుమార్, ఎంపీ తనుజారాణి, ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి, తదితరులు

జిల్లా అభివృద్ధికి సంపూర్ణత అభియాన్ తోడ్పాటు

ప్రారంభోత్సవంలో కలెక్టర్ దినేశ్‌కుమార్

- జిల్లాలో వై.రామవరం, గంగవరం, మారేడుమిల్లి మండలాలు ఎంపిక
- రాష్ట్రంలో 3 జిల్లాల్లో అమలు



చిన్నారికి పోషకాహారం పెడుతున్న కలెక్టర్ దినేశ్‌కుమార్

పాడేరు, జూలై 6 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'సంపూర్ణత అభియాన్'తో జిల్లా అభివృద్ధి, సంక్షేమానికి తోడ్పాటు లభిస్తుందని జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ అన్నారు. నీతిఆయోగ్ సూచనల మేరకు రాష్ట్రంలో కడప, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లాలను 'సంపూర్ణత అభియాన్' కార్యక్రమానికి కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసింది. అలాగే జిల్లాలో వై.రామవరం, గంగవరం, మారేడుమిల్లి మండలాలను అందుకు ఎంపిక చేశారు. శనివారం 'సంపూర్ణత అభియాన్' కార్యక్రమాన్ని కలెక్టర్ దినేశ్‌కుమార్ జ్యోతి ప్రజ్వలన చేసిన లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఈ పథకం కింద పోషకాహారం, ఆరోగ్యం, విద్య, వ్యవసాయ, అనుబంధ రంగాలు, మౌలిక సదుపాయాలపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తుందన్నారు. అందుకు అనుగుణంగా ఆయా శాఖల అధికారులు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా సంపూర్ణత అభియాన్ పోస్టర్‌ను ఆవిష్కరించి, పలువురు గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. చిన్నారులకు పోషకాహారాన్ని అందించారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు అందించాల్సిన సేవలను ఐసీడీఎస్ పీడీ ఎన్.సూర్యలక్ష్మి వివరించారు. ఈ కార్యక్రమంలో అరకులోయ ఎంపీ డాక్టర్ జి.తనుజారాణి, నీతి ఆయోగ్ ప్రతినిధి సాయి తేజ్, జిల్లా రెవెన్యూ అధికారి బి.పద్మావతి, జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి డాక్టర్ సి.జమాల్‌భాషా, జిల్లా వ్యవసాయాధికారి ఎస్‌బీఎస్.నంద్, ముఖ్యప్రణాళికాధికారి కె.పట్నాయిక్, ప్రకృతి వ్యవసాయం జిల్లా మేనేజర్ ఎల్.భాస్కరరావు, పలువురు జడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, సర్పంచులు పాల్గొన్నారు.

వేధిస్తున్నాడని జైలుకు పంపితే..

బెయిల్‌పై వచ్చి చంపేశాడు



నిందితుడు సురేష్ (ఫైల్)

రాంబిల్లి మండలంలో బాలిక దారుణ హత్య

- స్కూల్‌కు వెళ్లేదారిలో ఆమెకు తీవ్ర వేధింపులు
- ఆమె తల్లిదండ్రుల ఫిర్యాదుతో అతడిని అరెస్టు చేసి జైలుకు పంపిన పోలీసులు
- పదిరోజుల క్రితం బెయిల్‌పై బయటకు.. ఇంట్లోకి చొరబడి కత్తితో నరికి ఘాతుకం

రాంబిల్లి, జూలై 6:

బాలికపై వేధింపులకు పాల్పడుతున్నాడని అతడిని జైలుకు పంపితే బెయిల్‌పై బయటకు వచ్చి ఘాతుకానికి పాల్పడ్డాడు. అన్నెంపున్నెం ఎరుగని ఆ బాలికను అతి దారుణంగా హత్యచేశాడు. ఈ ఘటన శనివారం సాయంత్రం అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలంలో చోటుచేసుకుంది. మృతురాలి తల్లిదండ్రులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం...

హత్యకు గురైన బాలికది రాంబిల్లి మండలంలోని కొప్పుగొండుపాలెం గ్రామం. గ్రామానికి పది కిలోమీటర్ల దూరంలో ఉన్న మండల కేంద్రమైన రాంబిల్లి హైస్కూల్‌లో తొమ్మిదో తరగతి చదువుతోంది. పాఠశాలకు వెళుతున్న ఆమెను కశింకోటకు చెందిన సురేశ్ వెంటాడి వేధిస్తుండేవాడు. అతడి అమ్మమ్మ, తాత కొప్పుగుండుపాలెంలో ఉంటున్నారు. తరచూ గ్రామానికి వస్తుండేవాడు. సురేశ్ వ్యవహారం తెలిసి బాలిక తల్లిదండ్రులు రెండు నెలల క్రితం రాంబిల్లి స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి సురేశ్‌ను అరెస్టు చేసి జైలుకు పంపారు. సుమారు పది రోజుల క్రితం బెయిల్‌పై బయటకు వచ్చాడు. రోజూ ... మిగతా 8వ పేజీలో

జిప్‌లైన్ వివాదం

కేబుల్ తొలగింపును అడ్డుకున్న పంచాయతీ కార్యవర్గం

- అటువంటిదేమీ లేదు, మరమ్మతులు చేస్తున్నారన్న టూరిజం డిపార్టుమెంట్
- ఆర్‌డీకి ఫిర్యాదు చేసిన అనంతగిరి జడ్పీటీసీ సభ్యుడు గంగరాజు
- నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేటు వ్యక్తికి కట్టబెట్టారని ఆరోపణ
- 20 శాతం ఆదాయం పంచాయతీకి ఇవ్వాలని, జిప్‌లైన్‌ను టూరిజం శాఖే నిర్వహించాలని డిమాండ్

అరకులోయ, జూలై 6:

బొర్రాగుహలు వద్ద ఏపీటీడీసీ పేరుతో నిర్మించిన జిప్‌లైన్‌కు సంబంధించిన ఐరన్ కేబుల్‌ను తొలగిస్తుండగా బొర్రా పంచాయతీ కార్యవర్గం అడ్డుకున్నది. ఈ విషయం తెలిసిన వెంటనే అనంతగిరి జడ్పీటీసీ సభ్యుడు గంగరాజు పర్యాటక శాఖ ఆర్‌డీకి ఫిర్యాదు చేశారు. అయితే తాము ఎవరికీ అనుమతులు ఇవ్వలేదన్న ఈడీ కొద్దిసేపటికే మరమ్మతులు చేస్తున్నారంటూ సర్దుబాటు చేసేందుకు యత్నించారు. వివరాల్లోకి వెళితే..

బొర్రాగుహలు వద్ద ఏపీటీడీసీ పేరుతో నిర్మించిన జిప్‌లైన్‌ను ప్రైవేటు వ్యక్తి తొమ్మిది నెలల పాటు నిర్వహించాడు. ఇందుకు పర్యాటక శాఖతో ప్రైవేటు వ్యక్తి ఒప్పందం చేసుకున్నాడు. ఇది నిబంధనలకు విరుద్ధమని గిరిజన సంఘాలు, పంచాయతీ కార్యవర్గం రాష్ట్ర ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేశాయి. దీనిపై ఎస్టీ కమిషన్ కూడా పర్యాటక శాఖ అధికారులకు లేఖ రాసినా పట్టించుకోలేదు. అయితే జిప్‌లైన్‌ను 9 నెలలు నిర్వహించిన ప్రైవేటు వ్యక్తి రాష్ట్రంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మరుసటి రోజే నిలుపుదల చేశాడు. అయితే శనివారం జిప్‌లైన్‌ను నిర్వహిస్తున్న ప్రైవేటు వ్యక్తి టూరిజం శాఖ అధికారులను నుంచి అనుమతి తీసుకోకుండానే జిప్‌లైన్‌ను తొలగించే ప్రయత్నం చేపట్టాడు. దీనిని స్థానిక పంచాయతీ ప్రతినిధులు, గిరిజనులు అడ్డుకున్నారు. ఈ విషయమై టూరిజం ఆర్‌డీ శ్రీనివాస్‌కు అనంతగిరి జడ్పీటీసీ సభ్యుడు దీసరి గంగరాజు ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. జిప్‌లైన్ తొలగించేందుకు ఎలా అనుమతించారు? ప్రైవేటు వ్యక్తి ఏ విధంగా తొలగించే పనులు చేపడతారంటూ ప్రశ్నించారు. నిబంధనలకు విరుద్ధంగా, గిరిజన చట్టాలకు వ్యతిరేకంగా ప్రైవేటు వ్యక్తులకు ఎలా కట్టబెడతారని ప్రశ్నించారు. ఈ విషయమై ఈడీ పద్మలతను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా.. తమ అనుమతి లేకుండా ప్రైవేటు వ్యక్తి ఎలా తొలగిస్తారని, తొలగించేందుకు తాము ఎవరికి ఎటువంటి ఉత్తర్వులు ఇవ్వలేదని స్పష్టంచేశారు. కొద్దిసేపటి తర్వాత ఆమె 'ఆంధ్రజ్యోతి'కి ఫోన్ చేసి కొద్ది రోజులు జిప్‌లైన్ నిలిపివేసినందున నిర్వహణ పనుల చేస్తున్నారని సర్దుబాటు చేసేందుకు యత్నించారు.



జిప్‌లైన్‌కు సంబంధించిన ఐరన్ వైర్‌ను తొలగించే పనులు చేస్తున్న దృశ్యం

జిప్‌లైన్‌ను టూరిజం శాఖ నిర్వహించాలి

బొర్రాగుహలు వద్ద ఏర్పాటు చేసిన జిప్‌లైన్‌ను టూరిజం శాఖ నిర్వహించాలని స్థానిక గిరిజన సంఘాలు, పంచాయతీ కార్యవర్గం, గిరిజనులు డిమాండ్ చేశారు. ఇప్పటివరకు ప్రైవేటు వ్యక్తికి వచ్చిన ఆదాయాన్ని టూరిజం శాఖకు జమ చేయాలని, బొర్రా ... మిగతా 8వ పేజీలో

అంబులెన్స్‌లో ప్రసవం

- తల్లీబిడ్డ క్షేమం
- లోతుగెడ్డ పీహెచ్‌సీకి తరలింపు



అంబులెన్స్‌లో ప్రసవం పొందిన గర్భిణి

చింతపల్లి, జూలై 6: మండలంలో గర్భిణిని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో అంబులెన్స్‌లో ప్రసవం జరిగింది. మండలంలోని బలపం పంచాయతీ కోటగున్నలు గ్రామానికి చెందిన కిల్లో చిన్నికి నెలలు నిండడంతో శనివారం సాయంత్రం ఆరు గంటలకు పురిటి నొప్పులు ప్రారంభమయ్యాయి. కుటుంబ సభ్యులు 108కి సమాచారం ఇవ్వడంతో అంబులెన్స్‌లో సిబ్బంది రాత్రి 7గంటలకు గ్రామానికి చేరుకున్నారు. వాహనంలో గర్భిణిని లోతుగెడ్డ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలిస్తుండగా పురిటినొప్పులు ఎక్కువయ్యాయి. దీంతో అంబులెన్స్‌ను మార్గ మధ్యలో నిలిపివేసి ఈఎంటీ రాజు, పైలట్ దావీదు సాయంతో పురుడు పోశాడు. చిన్ని పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చింది. తల్లి, శిశువును లోతుగెడ్డ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించామని, ఇద్దరూ ఆరోగ్యంగా ఉన్నారని 108 ఈఎంటీ తెలిపారు.

టెన్త్ తెలుగు వాచకంలో మోదకొండమ్మ జాతర

పాఠ్యపుస్తకంలో మన్యం దేవతకు చోటు

- ఏజెన్సీలో సర్వత్రా హర్షం
- టీడీపీ ప్రభుత్వ హయాంలోనే రాష్ట్ర స్థాయి ఉత్సవంగా గుర్తింపు

మోదకొండమ్మ జాతర

ప్రకృతి అందాలకు ఆలవాలం పాడేరు మన్యం ప్రాంతం. ఇక్కడ గిరిజనుల దేవతగా మోదకొండమ్మ పూజలు అందుకుంటుంది. మోదం అంటే సంతోషం. కొండలలో వెలసిన దేవత కనుక కొండమ్మ అని పిలిచారు. అన్ని కోరికలకు మూలమైన సంతోషాన్ని ప్రసాదించడం అమ్మవారి ప్రత్యేకత. ప్రతి ఏటా మే నెలలో అమ్మవారికి మూడు రోజులపాటు ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతాయి. ఇది రాష్ట్రంలోనే అతిపెద్ద వేడుకగా పేరొందిన గిరిజన జాతర. ఈ జాతరలో గిరిజన సంప్రదాయ నృత్యం థింసా ఒక ప్రత్యేక ఆకర్షణ. ఈ జాతరకు విశాఖ గోదావరి జిల్లాల నుండే కాక ఒడిస్సా, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రాల నుండి భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి మొక్కులు తీర్చుకుంటారు. రాష్ట్రప్రభుత్వం 2014లో దీనిని రాష్ట్ర జాతరగా గుర్తించింది.



తెలుగు పాఠ్యపుస్తకంలో 14వ పేజీలో 'మోదకొండమ్మ జాతర' పాఠం

(ఆంధ్రజ్యోతి-పాడేరు)

మన్యం దేవతగా ఉత్తరాంధ్ర జిల్లాల్లో విశేష ప్రాచుర్యం పొందిన 'పాడేరు మోదకొండమ్మ'కు పదో తరగతి తెలుగు వాచకంలో చోటు దక్కింది. ఈ విద్యా సంవత్సరంలో ముద్రించిన పదో తరగతి తెలుగు వాచకంలో 'ప్రత్యక్ష దైవాలు' పేరిట రెండు తెలుగు రాష్ట్రాలకు సంబంధించిన పలు పండగలు, సంప్రదాయాలను పాఠ్యాంశాల్లో చేర్చారు. అందులో భాగంగా తెలుగు వాచకం 14వ పేజీలో 'మోదకొండమ్మ జాతర' శీర్షికతో పాడేరులో ప్రతి ఏడాది ఏప్రిల్ లేదా మే నెలలో మూడు రోజులు నిర్వహించే జాతర గురించి వివరించారు. దీనిని రాష్ట్ర స్థాయి గిరిజన జాతరగా గుర్తించిన వైనాన్ని ప్రస్తావించారు. పాడేరుకు చెందిన మోదకొండమ్మ జాతర అంశాన్ని పదో తరగతి తెలుగు వాచకంలో పాఠ్యాంశంగా చేర్చడంపై మన్యం వాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా.. మోదకొండమ్మ ఉత్సవాలను రాష్ట్ర స్థాయి ఉత్సవాలుగా గుర్తింపు తీసుకువచ్చినది తెలుగుదేశం ప్రభుత్వమే.. తాజాగా మోదకొండమ్మ జాతరను టెన్త్ తెలుగు వాచకంలో స్థానం కల్పించినది తెలుగుదేశం ప్రభుత్వమే కావడం విశేషం.

జిల్లాలో 1.66 లక్షల టన్నుల ఇసుక సిద్ధం

రేపటి నుంచి గుండాల- 1, 2 రీచ్‌ల్లో విక్రయాలు ప్రారంభం

- గుండాల-1 రీచ్‌లో టన్నుకు రూ.292, గుండాల-2లో టన్నుకు రూ.237గా నిర్ణయం



ఏటపాక మండలం గుండాల వద్ద ఇసుక రీచ్

(పాడేరు-ఆంధ్రజ్యోతి)

ఇసుక విక్రయాల వ్యవహారాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఒక కొలిక్కి తీసుకువచ్చింది. జిల్లాలో 1 లక్షా 66 వేల టన్నుల ఇసుక విక్రయానికి సిద్ధంగా ఉందని జిల్లా యంత్రాంగం ప్రకటించింది. శనివారం సీఎస్ నీరబ్‌కుమార్ ఇసుకపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి జిల్లా అధికారులను అప్రమత్తం చేశారు. చింతూరు డివిజన్ పరిధిలోని ఏటపాక మండలం గుండాల వద్ద ఉన్న రెండు ఇసుక రీచ్‌ల్లోనూ ఈనెల 8వ తేదీ నుంచి విక్రయాలు ప్రారంభించాలని ఇప్పటికే జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ సంబంధిత అధికారులకు సూచించారు. జిల్లాలో చింతూరు రెవెన్యూ డివిజన్ పరిధిలో గుండాల-1 రీచ్‌లో 87,800 టన్నులు, గుండాల-2 రీచ్‌లో 79,026 టన్నుల ఇసుక అందుబాటులో ఉంది. అలాగే అన్ని చార్జీలతో కలిపి గుండాల-1 రీచ్‌లో ఉన్న ఇసుక టన్నుకు రూ.292, గుండాల-2 రీచ్‌లో టన్నుకు రూ.237లు కొనుగోలుదారులు చెల్లించాల్సి ఉంటుంది. రెండు రీచ్‌ల్లోని గిరిజన అభ్యర్థులతో కూడిన ఏజెన్సీ ద్వారా ఇసుక విక్రయాలను నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. ఇదిలా ఉండగా పాడేరు రెవెన్యూ డివిజన్ పరిధిలో ఇసుక రీచ్‌లు లేవు. దీంతో స్థానిక గెడ్డల్లోంచి ఇసుకను తీసుకుని స్థానికులు వినియోగించుకుంటున్నారు.

క్రైం... crime news

విద్యుదాఘాతంతో గిరిజన యువకుడి మృతి


టైసన్ మృతదేహం

చింతపల్లి, జూలై 6: గూడెంకొత్తవీధి మండలం వంచుల పంచాయతీ సిరిబాల గ్రామంలో ఓ గిరిజన యువకుడు విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. శనివారం మధ్యాహ్నం సిరిబాల గ్రామానికి చెందిన జోరంగి టైసన్(27) విద్యుత్ స్తంభంపై వీధి లైట్ ఏర్పాటు చేసేందుకు అల్యూమినియం నిచ్చెన ఏర్పాటు చేసుకున్నాడు. ఈ క్రమంలో విద్యుత్ తీగలు తగలడం వల్ల అతను విద్యుదాఘాతానికి గురై కిందపడిపోయాడు. దీంతో కుటుంబ సభ్యులు ఆర్‌వీనగర్ ఆస్పత్రికి తరలించగా వైద్యులు వెంటనే చింతపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఏరియా ఆస్పత్రిలో వైద్యులు చికిత్స చేస్తుండగా అప్పటికే యువకుడు ఆరోగ్య పరిస్థితి విషమించి మృతి చెందాడు.

ఎం.కోడూరులో తాపీమేస్త్రీ మృతి


నాగేశ్వరరావు మృతదేహం

మాడుగుల, జూలై 6: విద్యుదాఘాతానికి గురై ఓ తాపీమేస్త్రీ మృతిచెందిన సంఘటన మాడుగులలో చోటుచేసుకుంది. దీనికి సంబంధించిన వివరాలు ఇలా వున్నాయి. ఎం.కోడూరు గ్రామానికి చెందిన బిక్కవోలు నాగేశ్వరరావు(33) మాడుగులలో తాపీమేస్త్రీగా పనికి వచ్చాడు. శనివారం మధ్యాహ్నం ఇంటి నిర్మాణ పనులు చేపడుతున్న సమయంలో ప్రమాదవశాత్తూ విద్యుత్ తీగలు తగిలి షాక్‌కి గురయ్యాడు. వెంటనే సహచర కూలీలు మాడుగుల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. మృతుని భార్య పార్వతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ దామోదర్‌నాయుడు తెలిపారు.

గంజాయి రవాణా కేసులో ప్రధాన నిందితుడి అరెస్టు

కృష్ణాదేవిపేట, జూలై 6: గంజాయి రవాణా కేసులో ఏడేళ్ల నుంచి పరారీలో ఉన్న ప్రధాన నిందితుడు జడ్డు నాగరాజు ఎట్టకేలకు పట్టుబడినట్టు కృష్ణాదేవిపేట ఎస్ఐ ఎం.ఉపేంద్ర తెలిపారు. 2017వ సంవత్సరంలో 106 కిలోల గంజాయి రవాణాలో వాహనాలతో ఎనిమిది మందిని పట్టుబడగా అల్లూరి జిల్లా గూడెంకొత్తవీధి మండలం మొండిగెడ్డ గ్రామానికి చెందిన జడ్డు నాగరాజు(50) అప్పటి నుంచి పరారీలో ఉన్నాడు. ఎట్టకేలకు శనివారం అదుపులో తీసుకున్నట్టు ఎస్ఐ తెలిపారు. పట్టుబడి నాగరాజుపై కేసు నమోదు చేసి కోర్టు ఆదేశాల మేరకు విశాఖపట్నం సెంటర్ జైలుకు రిమాండ్‌కు పంపినట్లు ఎస్ఐ తెలిపారు. గిరిజన, మైదాన ప్రాంతాల్లో ఎక్కడైనా గంజాయి ఆచూకీ తెలిస్తే ప్రజలు పోలీసులకు ఫిర్యాదు చేయాలని ఎస్ఐ కోరారు.

కారు ఢీకొని మహిళ మృతి

కొత్తూరు, జూలై 6: అనకాపల్లి మండలం శంకరం గ్రామం వద్ద రోడ్డు దాటుతున్న మహిళను అనకాపల్లి నుంచి పెందుర్తి వైపు వెళ్తున్న గుర్తు తెలియని కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో గ్రామానికి చెందిన యల్లపు నాగమణి (50) అక్కడికక్కడే మృతి చెందిందని స్థానికులు తెలిపారు. ఈ విషయమై రూరల్ పోలీసులకు వారు సమాచారం ఇవ్వగా మృతదేహాన్ని అనకాపల్లి ఎన్టీఆర్ ప్రభుత్వాసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కాగా ప్రమాదానికి కారణమైన కారును ఛేదించేందుకు రూరల్ పోలీసులు ముమ్మరంగా తనిఖీలు చేస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వరహానదిలో గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ఎస్.రాయవరం, జూలై 6: మండలంలోని సోముదేవుపల్లి సమీపంలో గల వరహానదిలో శుక్రవారం రాత్రి గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్టు ఎస్ఐ విభీషణరావు శనివారం తెలిపారు. దీనికి సంబంధించి ఎస్ఐ అందించిన వివరాలిలా ఉన్నాయి. మృతి చెందిన వ్యక్తి ఎవరన్నది వివరాలు తెలియరాలేదని, మృతుడు ఎరుపు రంగు చొక్కా, డార్క్ రంగు షార్ట్ వేసుకొని ఉన్నాడన్నారు. జుట్టు, గెడ్డం కూడా పొడవుగా ఉందని, ఇంతకి మించి ఎటువంటి ఆధారాలు లేవని తెలిపారు. సుమారు 30 నుంచి 35 ఏళ్ల వయస్సు ఉంటుందన్నారు. కేసు నమోదుచేసి, మృతదేహాన్ని నక్కపల్లి మార్చ్యూరీలో భద్రపరిచామని, మృతి చెందిన వ్యక్తి సమాచారం ఎవరికైన తెలిస్తే 9440796107 సంప్రదించాలని ఆయన కోరారు.

ఎరువుల దుకాణంలో ప్రత్యేక బృందాల తనిఖీలు

ఎస్.రాయవరం, జూలై 6: మండలంలోని అడ్డరోడ్డులో ఉన్న వీరభద్ర ఎరువులు, పురుగుల మందుల దుకాణంలో వ్యవసాయ, విజిలెన్స్ శాఖల అధికారులు శనివారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. వ్యవసాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఏర్పాటైన జిల్లా స్పెషల్ టీం సభ్యులు రంపచోడవరం ఏడీఏ సీసీహెచ్ చౌదరి, విశాఖపట్నం ఐవోబీ ఎ. రవిప్రసాద్ ఎరువులు, పురుగులమందుల నిల్వలను పరిశీలించారు. అనంతరం రికార్డులను తనిఖీ చేశారు. ఇందులో భాగంగా దుకాణంలో ఉన్న స్టాక్ రిజిస్టర్‌లో చిన్న చిన్న తప్పులను గుర్తించిన అధికారులు వాటిని సవరించాలని సూచించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎరువులు, పురుగుల మందుల నిల్వలకు సంబంధించి దుకాణాల్లో నాణ్యత ప్రమాణాలు పాటించడమే కాకుండా ఎంఆర్‌పీ ధరలకు మించి విక్రయించకూడదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారిణిలు సౌజన్య, సరోజిని తదితరులు పాల్గొన్నారు.

జూన్‌లో పెరిగిన విమానాల సంఖ్య

విశాఖపట్నం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం విమానాశ్రయం నుంచి దేశంలోని వివిధ ప్రాంతాలకు వెళ్లే విమానాల సంఖ్య జూన్ నెలలో కాసింత పెరిగింది. గత ఏడాది జూన్‌లో 1,692 విమానాలు రాకపోకలు సాగించగా, ఈ ఏడాది జూన్‌లో వాటి నాల సంఖ్య 1,704కు పెరిగింది. అయితే విమాన ప్రయాణికుల సంఖ్య స్వల్పంగా తగ్గింది కిందటేడాది జూన్‌లో 2,54,490 మంది ప్రయాణించగా, ఈ జూన్‌లో 2,32,149 మంది ప్రయాణం చేశారని ఏపీ విమాన ప్రయాణికుల సంఘం ప్రతినిధులు నరేశ్‌కుమార్, కుమార్ రాజా, డీఎస్ వర్మలు తెలిపారు. డిజి యాత్ర విధానం అమలు వల్ల విమాన ప్రయాణికులు చాలా త్వరగా క్లియరెన్స్ తీసుకొని కేటాయించిన లాంజ్‌లోకి వెళ్లగలుగుతున్నారని వివరించారు. చెకిన్ టైమ్‌ని ఇది బాగా తగ్గిస్తున్నదని పేర్కొన్నారు.

వీఎంఆర్‌డీఏ కమిషనర్‌గా రవీంద్ర బాధ్యతల స్వీకారం

విశాఖపట్నం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): వీఎంఆర్‌డీఏ మెట్రోపాలిటన్ కమిషనర్‌గా వి.రవీంద్ర శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఇప్పటివరకు జాయింట్ కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహించారు. కమిషనర్ పోస్టు ఖాళీ కావడంతో కొత్త వారిని నియమించే వరకూ పూర్తి అదనపు బాధ్యతలతో పనిచేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో శనివారం ఆ ఛాంబర్‌కు వెళ్లారు. ఈ సందర్భంగా సెక్రటరీ కీర్తి, చీఫ్ ఇంజినీర్ భవానీ శంకర్, ఎస్ఈ బలరామునాయుడు, సీఏఓ హరిప్రసాద్, డీఎఫ్ఓ శాంతిస్వరూప్ తదితరులు ఆయన్ను కలిసి అభినందించారు. అన్ని విభాగాల సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

సీఎం రమేశ్‌పై దాడి ఘటనలో సీఐ, ఎస్ఐలపై చర్యలు తీసుకోవాలి

▸ నిర్మాత, టీడీపీ నేత నట్టికుమార్ డిమాండ్



చోడవరం, జూలై 6: ఎన్నికల సమయంలో మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు స్వగ్రామం తారువలో సీఎం రమేశ్‌పై జరిగిన దాడి ఘటనలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన సీఐ స్వామినాయుడు, దేవరాపల్లి ఎస్ఐ నాగేంద్రలపై చర్యలు చేపట్టాలని సినీ నిర్మాత, టీడీపీ నేత నట్టికుమార్ డిమాండ్ చేశారు. శనివారం సాయంత్రం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఘటన జరిగిన రోజున ఎస్ఐ, సీఐలు వైసీపీకి అనుకూలంగా వ్యవహరించి టీడీపీ కార్యకర్తలపై దౌర్జన్యానికి దిగారని ఆరోపించారు. నాడు పోలీసుల తీరుపై ఇప్పటికే ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశామని, అయినా ఆ ఇద్దరు అధికారులపై ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు లేకపోవడం సరికాదని, తక్షణం ఆ ఇద్దరు పోలీసు అధికారులను సస్పెండ్ చేయడంతో పాటు శాఖాపరమైన చర్యలు చేపట్టాలని కోరారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	110.00
లైవ్ ధర	130.00
విత్ స్కిన్	230.00
స్కిన్ లెస్	240.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	560
విజయనగరం	564
శ్రీకాకుళం	564

అధ్వానంగా అనకపల్లి-లంకెలపాలెం రోడ్డు

- ప్రయాణం నరకం
- వర్షాలతో ప్రయాణికులకు తప్పని తిప్పలు
- భారీ వాహనాలతో రోడ్డు ధ్వంసం
- పట్టించుకోని అధికారులు

దారి పొడవునా గోతులు


ఎరుకునాయుడుపాలెం సమీపంలో భారీ గోతులు పడిన దృశ్యం

వాహనాలు

సబ్బవరం, జూలై 6: మండలంలోని అనకపల్లి-లంకెలపాలెం రహదా రిపై ప్రయాణం నరకప్రాయంగా తయారైంది. రోడ్డుపై పలుచోట్ల భారీ గోతులు ఏర్పడడంతో పరిస్థితి దారణంగా మారింది. ఇటీవల వర్షాలకు రోడ్లు పలు చోట్ల ధ్వంసమవడంతో వాహన చోదకుల అవస్థలు వర్ణణాతీతం. ముఖ్యంగా అసకపల్లి, ఎరుకునాయుడుపాలెం, పైడివాడఅగ్రహారం, పెదముషిడివాడ తదితర ప్రాంతాల్లో రోడ్డుపై భారీగా గోతులు ఏర్పడడంతో ప్రయాణికులు, ద్విచక్ర వాహనదారులు, ఆటోవాలాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. దీంతో వాహన చోదకులకు కష్టాలు రెట్టింపు అయ్యాయి. ముఖ్యంగా రాత్రి వేళల్లో పరిస్థితి నరకం చూస్తున్నారు. తరచూ ప్రమాదాలు సంభవించి ప్రయాణికులు గాయాలపాలవుతున్నారని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. గత మూడేళ్లుగా జాతీయ రహదారి నిర్మాణంలో ల్యాండ్ ఫిల్లింగ్ కోసం ఫార్మాసిటీ, ఎన్టీపీసీ నుంచి వ్యర్థ పదార్థాలు, ఫ్లయాష్ బూడిదను భారీ వాహనాలు పరిమితికి మించి లోడుతో వెళుతుండడంతో రోడ్డు పూర్తిగా ధ్వంసమవుతుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుపై ఫార్మా వ్యర్థాలు పడిపోతుండడంతో ప్రజలు కాలుష్య బారిన పడుతున్నారు. ఇదే విషయమై పలు సార్లు పైడివాడఅగ్రహారం వద్ద స్థానికులు లారీలు నిలిపేసి నిరసన వ్యక్తం చేసినా ప్రయోజనం లేకపోయిందని గ్రామస్థులు వాపోతున్నారు. రోజూ వందల సంఖ్యలో భారీ రాకపోకలు సాగిస్తుండడం రోడ్డు ధ్వంసం కావడానికి కారణమని గుర్తించినా అధికారులు వాహనాలను నిరోధించలేకపోతున్నారని ఆయా గ్రామాల ప్రజలు అంటున్నారు. మరో పక్కన ఫ్లైయాష్ గాల్లో ఎగరడం వలన ఇళ్లలో ఉండలేకపోతున్నామని, అనకపల్లి, ఎరుకునాయుడుపాలెం, పైడివాడ అగ్రహారం, పెదముషిడివాడ తదితర గ్రామాల ప్రజల వాపోతున్నారు. రోడ్డుపై గోతులు ఏర్పడడంతో ద్విచక్ర వాహనాలు, ఇతర వాహనాలు గోతుల్లో పడి ప్రమాదాలకు గురవడమే కాకుండా, మరమ్మతులకు గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా చలనం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖ అధికారులు తక్షణమే స్పందించి కనీసం గోతులైనా పూడ్చాలని ప్రయాణికులు, స్థానికులు కోరుతున్నారు. అలాగే ఎన్టీపీసీ నుంచి వచ్చే భారీ వాహనాలను అనకాపల్లి మీదుగా సబ్బవరానికి మళ్లించాలని కోరుతున్నారు.


పైడివాడఅగ్రహారం వద్ద రోడ్డు దుస్థితి


అసకపల్లి వద్ద రోడ్డుపై ఏర్పడిన భారీ గోతులు

విద్యార్థుల్లోని నైపుణ్యాలను వెలికితీయాలి

▸ విద్యాశాఖ రీజినల్ డైరెక్టర్ విజయభాస్కర్


మాట్లాడుతున్న విద్యాశాఖ రీజినల్ డైరెక్టర్ విజయభాస్కర్

చోడవరం, జూలై 6: విద్యార్థులను కొట్టడం, తిట్టడం చేయకుండా వారిని గౌరవంగా చూస్తూ వారిలో దాగిఉన్న నైపుణ్యాలు వెలికితీసేలా ఉపాధ్యాయుల బోధన ఉండాలని విద్యాశాఖ రీజినల్ డైరెక్టర్ విజయభాస్కర్ సూచించారు. స్థానిక కొత్తూరు బాలికల హైస్కూల్‌లో సమగ్రశిక్షా ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న టీచ్‌టు టూల్ శిక్షణ శిబిరాన్ని శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా శిక్షణలో ఉపాధ్యాయులు విద్యార్థులకు బోధించే విషయంలో అనుసరించవలసిన విధానాల గురించి వివరించారు. విద్యార్థుల పాస్, ఫెయిల్‌తో సంబంధం లేకుండా, వారి స్థాయిని బట్టి బోధన చేయాలని, విద్యార్థులలో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికితీసే నేర్పును ఉపాధ్యాయులు అమలు చేయాలని కోరారు. ఈ సందర్భంగా శిక్షణలో ఉపాధ్యాయులు నేర్చుకున్న అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సమగ్రశిక్షా కోర్సు డైరెక్టర్ డాక్టర్ వి.రామిరెడ్డి, ఎంఈవోలు ఎంఈవోలు జయలక్ష్మి, సింహాచలం సీఆర్‌పీలు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్యామ్‌ప్రసాద్ ముఖర్జి జయంతి


శ్యామ్‌ప్రసాద్ ముఖర్జి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఎంపీ రమేశ్, బీజేపీ నాయకులు

అనకాపల్లి, జూలై 6 (ఆంధ్రజ్యోతి): అఖండ భారతావని కోసం ప్రాణాలర్పించిన జన్‌సంఘ్ వ్యవస్థాపకులు డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జి జయంతి సందర్భంగా శనివారం ఆయన చిత్రపటానికి అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనకాపల్లి క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో శ్యామ్ ప్రసాద్ ముఖర్జి సేవలను ఎంపీ కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ద్వారపురెడ్డి జగదీశ్వరరావు, కె.నరేంద్ర మోహన్, పరుచూరి భాస్కరరావు, వెన్నా శ్రీరామ్మూర్తి, సీఎం రాజేశ్, రిత్విక్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోట్ని బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

హామీలన్నింటినీ అమలు చేస్తాం

▸ కార్యకర్తలకు న్యాయం చేస్తా ▸ కూటమి ఆత్మీయ సమావేశంలో ఎంపీ సీఎం రమేశ్


సమావేశంలో మాట్లాడుతున్న సీఎం రమేశ్

కొత్తూరు, జూలై 6 : ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేస్తామని ఎంపీ సీఎం రమేశ్ అన్నారు. శనివారం అనకాపల్లి పట్టణంలోని ప్రైవేటు ఫంక్షన్ హాలులో నియోజకవర్గ స్థాయి జనసేన, టీడీపీ, బీజేపీ కార్యకర్తలు, నాయకులతో జరిగిన ఆత్మీయ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. తెలుగుదేశం ప్రభుత్వ కాపు కమ్యూనిటీ నిమిత్తం రెండు ఎకరాల స్థలం ఇస్తే వైసీపీ పార్టీ కార్యాలయాన్ని నిర్మించడం అన్యాయమన్నారు. ఎన్నికల సమయంలో కష్టపడిన కార్యకర్తలు, నాయకులందరికీ న్యాయం చేసేందుకు తామంతా సిద్ధంగా ఉన్నామన్నారు. విశాఖపట్నం నుంచి తిరుపతికి ప్రత్యేక రైలు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానన్నారు. అయోధ్య రామమందిరం చూపిస్తానని ఎన్నికల ముందు ఇచ్చిన హామీని అమలు చేసేందుకు కృషి చేస్తున్నానన్నారు. ఉత్తరాంధ్ర ఇలవేల్పు నూకాంబిక అమ్మవారి ఆలయాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రయత్నిస్తానన్నారు. పార్లమెంటు సమావేశాల్లో తప్ప ప్రతి రోజూ అనకాపల్లి ఎంపీ క్యాంపు కార్యాలయంలో అందుబాటులో ఉంటానని తెలిపారు.

పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు మాట్లాడుతూ చరిత్ర చూడలేని విజయాన్ని ప్రజలంతా కూటమి ప్రభుత్వానికి ఇచ్చారన్నారు. పోటీ చేసిన వ్యక్తుల్లో 93 శాతం విజయం సాధించారంటే ప్రజలు ఎంత కసిగా ఓటు వేశారో అర్థం చేసుకోవచ్చన్నారు. కేంద్రం నుంచి నిధులు రావాలన్నా, ప్రాజెక్టులు ఏపీ నిర్మాణాలు చేపట్టాలన్నా సీఎం రమేశ్ వల్లే సాధ్యమన్నారు. టీడీపీరాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బుద్ద నాగజగదీశ్వరరావు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో పరిశ్రమలు తీసుకువచ్చి స్థానికులకు 75శాతం ఉద్యోగావకాశాలు కల్పించాలని కోరారు. మాజీ మంత్రి దాడి వీరభద్రరావు మాట్లాడుతూ నరకాసురుడు గురించి ఎలా అయితే విన్నామో.. జగనాసురుని కోసం గత ఐదేళ్లలో వినడమే కాకుండా చూశామన్నారు. ఈ ఐదేళ్లలో దేశంలో ఉన్న భూములను ఎక్కడ దోచేస్తాడో అనే ఆందోళనతో ఇతర దేశాల నుంచి ప్రజల ఆస్తులను కాపాడుకునేందుకు ఎన్నికల్లో లక్షలాది రూపాయలు ఖర్చు చేసి వైసీపీని ఓడించేందుకు ఓటు వేశారన్నారు. అంత దుర్మార్గమైన పాలన జగనాసురుడు చేశాడని ఆరోపించారు. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, సీఎం రమేశ్ తనయుడు రిత్విక్ తదితరులు పాల్గొని మాట్లాడారు. అనంతరం ఎంపీ సీఎం రమేశ్‌కు కూటమి నేతలు పూలమాల వేసి నూకాంబిక అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించండి

▸ వాహనచోదకులకు అవగాహన

అనకాపల్లి టౌన్, జూలై 6: పట్టణంలో జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ ఆదేశాల మేరకు పట్టణ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పి.పైడపు నాయుడు ఆధ్వర్యంలో ట్రాఫిక్ సిబ్బంది శనివారం స్థానిక నెహ్రూచౌక్, రింగురోడ్డు జంక్షన్‌ల వద్ద రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పించారు. హెల్మెట్ ధరించిన వాహనదారులకు గులాబీ పువ్వులు ఇచ్చి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పైడపునాయుడు మాట్లాడుతూ వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు తప్పనిసరిగా పాటించాలని, హెల్మెట్ను ధరించి ప్రయాణం చేయాలన్నారు. ముఖ్యంగా యువత ద్విచక్రవాహనాలను నిర్లక్ష్యంగా, అతి వేగంగా నడపడరాదని సూచించారు.

కుటుంబ యజమాని, యువత, విద్యార్థులు రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తే ఆ కుటుంబానికి తీరని నష్టం జరుగుతుందన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

నేడు బాలికల జిల్లా హాకీ జట్ల ఎంపికలు

ఎలమంచిలి, జూలై 6: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల రాజీవ్‌గాంధీ క్రీడా మైదానంలో ఆదివారం ఉదయం 9.30 గంటలకు అంతర్ జిల్లాల సబ్ జూనియర్ బాలికల జిల్లా హాకీ జట్ల ఎంపికలు జరుగుతాయని హాకీ అసోసియేషన్ జిల్లా సెక్రటరీ కొఠారు నరేష్ ఒక ప్రకటనలో తెలిపారు. అనంతపురంలో జరగబోవు అంతర్ జిల్లాల హాకీ పోటీలకు జిల్లా జట్టును ఎంపిక చేస్తామన్నారు. ఈ ఎంపికలో పాల్గొనే క్రీడాకారిణిలు 2008 సంవత్సరం తరువాత జన్మించిన వారై ఉండాలన్నారు.

హోం మంత్రిని కలిసిన కలెక్టర్


కలెక్టర్ విజయకృష్ణన్‌తో చర్చిస్తున్న హోం మంత్రి అనిత

నక్కపల్లి, జూలై 6: రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనితను శనివారం జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన విజయ నక్కపల్లి సమీపంలో వున్న హోం మంత్రి అనిత నివాసానికి వచ్చారు. హోంమంత్రికి జిల్లా కలెక్టర్ పూలమొక్కలను అందజేసి, శుభాకాంక్షలు చెప్పారు. అనంతరం పాయకరావుపేట నియోజకవర్గంలోని ఎస్ఏజెడ్, ఏపీఐఐసీ కారిడార్ నిర్వాసిత రైతుల సమస్యలను కలెక్టర్ దృష్టికి హోం మంత్రి అనిత తీసుకువచ్చారు. మత్స్యకారులు, రైతులకు న్యాయం చేయాలని, అంకితభావంతో పనిచేసి జిల్లాను తీర్చిదిద్దాలన్నారు. వారి వెంట నియోజకవర్గంలోని పలువురు టీడీపీ నాయకులు, మత్స్యకార నాయకులు వున్నారు.

అల్ట్రాసౌండ్ లేదు..!

సామాజిక ఆరోగ్య కేంద్రంలో నిలిచిపోయిన పరీక్షలు

నిరాశతో వెనుదిరుగుతున్న గర్భిణులు.. ఆర్థిక భారమని గగ్గోలు

పట్టించుకోని వైద్య విధాన్ పరిషత్ అధికారులు, ప్రజా ప్రతినిధులు



సామాజిక ఆరోగ్య కేంద్రం.... (ఇన్‌సెట్‌లో) పనిచేయని అల్ట్రాసౌండ్ స్కానింగ్ మిషన్

ముంచంగిపుట్టు, జూలై 6: సామాజిక ఆరోగ్య కేంద్రం (సీహెచ్‌సీ)లో అల్ట్రాసౌండ్ పరీక్షలు జరగడం లేదు. కొద్ది రోజులుగా ఈ ప్రక్రియ నిలిచిపోయినా పట్టించుకునే నాథులే కరువయ్యారు. దీంతో వివిధ ప్రాంతాల నుంచి పదుల కిలోమీటర్లు వ్యయప్రయాసాలకోర్చి వస్తున్న గర్భిణులు తీవ్ర నిరాశతో వెనుదిరుగుతున్నారు.

సీహెచ్‌సీలో ప్రతీ మంగళ, గురువారాల్లో గర్భిణులకు అల్ట్రాసౌండ్ పరీక్షలు చేసి శిశువు పరిమాణం, ఆరోగ్య పరిస్థితి, హృదయ స్పందన, కడుపులో ఉండే విధానం తదితర అంశాలను తెలియజేయడంతో పాటు అవసరమైన మందులు, ఆరోగ్య పరీక్షలను చేయాల్సి ఉంటుంది. దీంతో గర్భిణులు తమ శిశువు స్థితిగతులను తెలుసుకొని ముందుగానే జాగ్రత్తలు పడేందుకు ఎంతగానో ఉపయోగం ఉంటుంది. అందువల్ల సుదూర ప్రాంతాల నుంచి గర్భిణులు అల్ట్రాసౌండ్ స్కాన్ తీసుకోవడానికి వ్యయప్రయాసాలకోర్చి వస్తున్నారు. అయితే ప్రస్తుతం స్కానింగ్ పనిచేయడం లేదు. గతంలో సీహెచ్‌సీలో పాడేరు జిల్లా ఆస్పత్రి నుంచి గైనకాలజిస్ట్ ఇక్కడికి వచ్చి అల్ట్రాసౌండ్ పరీక్షలు చేసేవారు. గత కొన్ని రోజులుగా ఆమె రాకపోవడం, సీహెచ్‌సీలో గైనకాలజిస్ట్‌ను నియమించకపోవడంతో ప్రస్తుతం పరీక్షలు నిలిచిపోయాయి. దాని కారణంగా స్కానింగ్‌కు వచ్చే గర్భిణులు తీవ్ర నిరాశతో వెనుదిరుగుతున్నారు.

గర్భిణులకు తప్పని ఇబ్బందులు

వైద్యుల సలహా మేరకు కొంత మంది గర్భిణులు స్కానింగ్ కోసం సుమారు 50 కిలోమీటర్ల దూరంలో గల పాడేరు జిల్లా ఆస్పత్రికి వెళుతున్నారు. అక్కడికి వెళ్లి స్కానింగ్ చేయించుకోవడం తలకు మించిన భారంగా ఉంటుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతీ వారం సీహెచ్‌సీకి 40 నుంచి 50 మంది వరకు గర్భిణులు స్కానింగ్ నిమిత్తం వస్తుంటారు. అయినప్పటికీ గైనకాలజిస్ట్‌ని నియమించకపోవడం సంబంధిత అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. సీహెచ్‌సీలో గర్భిణులకు స్కానింగ్ సక్రమంగా చేయకపోతే మాతాశిశు మరణాల నివారణ ఎలా సాధ్యపడుతుందని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి సీహెచ్‌సీలో గర్భిణులకు స్కానింగ్ జరిగే విధంగా చూడాలని స్థానిక ప్రజలు, గర్భిణులు కోరుతున్నారు.

ఈ విషయంపై సీహెచ్‌సీ వైద్యాధికారిని గీతాంజలిని విలేకర్లు వివరణ కోరగా గైనకాలజిస్టు లేకపోవడం వల్ల గత రెండు వారాలుగా స్కానింగ్ పనులు జరగడం లేదని, ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లామని చెప్పారు.

సిహెచ్‌సీలో స్కానింగ్ జరిగేలా చూడాలి

-పాండురంగస్వామి, టీడీపీ నాయకుడు

సీహెచ్‌సీలో గర్భిణులకు స్కానింగ్ పరీక్షలు జరిగే విధంగా చూడాలి. ఈ మేరకు పాడేరు ఐటీడీఏ పీవోకు శుక్రవారం వినతిపత్రం కూడా ఇచ్చాం. గత కొంత కాలంగా స్కానింగ్ నిలిచిపోవడంతో సీహెచ్‌సీకి వచ్చే గర్భిణులు ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే ఆ సమస్యను పరిష్కరించాలని పీవోను కోరాం.



కుమ్మరిపుట్టులో దోమల మందు పిచికారీ చేస్తున్న దృశ్యం

దోమల నివారణ మందు పిచికారీ చేయించుకోవాలి

పాడేరు రూరల్, జూలై 6: వ్యాధుల నుంచి రక్షణ పొందేందుకు దోమల నివారణ మందును పిచికారీ చేయించుకోవాలని ఎంపీహెచ్‌ఈవో శెట్టి నాగరాజు కోరారు. చింతలవీధి సబ్ సెంటర్ పరిధిలోని కుమ్మరిపుట్టు గ్రామంలో శనివారం ఇంటింట స్ప్రేయింగ్ పనులను చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మలేరియా నియంత్రణే ధ్యేయంగా చేపట్టిన దోమల నివారణ మందు పిచికారినీ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కకోరారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది కృష్ణవేణి, సంధ్యా, ఈశ్వరమ్మ, భానుమతి, చిన్ని, నారాయణమ్మ పాల్గొన్నారు.

పసుపు సాగులో ఆధునిక పద్ధతులతో అధిక లాభాలు

» జిల్లా ఉద్యానవన శాఖాధికారి రమేశ్



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా ఉద్యాన శాఖాధికారి రమేశ్

చింతపల్లి, జూలై 6: ఆదివాసీ రైతులు పసుపు సాగులో ఆధునిక పద్ధతులు పాటిస్తే అధిక లాభాలు పొందవచ్చునని జిల్లా ఉద్యాన శాఖ అధికారి రమేశ్ అన్నారు. శనివారం స్థానిక ఉద్యాన పరిశోధన స్థానంలో ఈ-మిర్చా ప్రాజెక్టులో భాగంగా ఉద్యాన శాఖ, డిజిటల్ గ్రీన్ సంయుక్తంగా పసుపు సాగులో నూతన పద్ధతులపై ఎఫ్‌పీవో సభ్యులు, వ్యవసాయ, ఉద్యాన శాఖ క్షేత్ర స్థాయి ఉద్యోగులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రమేశ్ మాట్లాడుతూ పసుపు సాగులో యంత్రాల వినియోగం వల్ల పెట్టుబడి తగ్గించుకుని ఆదాయం పెంచుకోవచ్చునన్నారు. ప్రధానంగా పసుపు సాగులో మేలి జాతి విత్తనాన్ని రైతులు ఎంపిక చేసుకోవాలన్నారు. బెడ్స్ ఏర్పాటు చేసుకొని నాట్లు వేసుకోవాలన్నారు. బెడ్స్‌లో నాట్లు వేసుకోవడం వల్ల దిగుబడి పెరగడంతోపాటు దుంప కుళ్లును నియంత్రించుకోవచ్చునన్నారు. ఉద్యాన పరిశోధన స్థానం అధిపతి, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ శివకుమార్ మాట్లాడుతూ పసుపు నాట్లు వేసుకునే పొలాల్లో ముందుగా పచ్చిరొట్ట ఎరువు పెంచుకుని కలియ దున్నుకోవాలన్నారు. పచ్చిరొట్ట ఎరువు వల్ల దిగుబడులు రెట్టింపు అవుతాయన్నారు. ప్రధానంగా నాట్లు వేసేందుకు తల్లి కొమ్మును ఎంపిక చేసుకోవాలన్నారు.ఒక్కొక్క విత్తనం 50 నుంచి 60 గ్రాముల బరువు ఉండి, నాలుగైదు కణుపులు ఉంటే సరిపోతుందన్నారు. విత్తనశుద్ధి విధిగా చేసుకోవాలన్నారు. పసుపు సాగులో కలుపు లేకుండా చూసుకోవాలన్నారు. డిజిటల్ గ్రీన్ సంస్థ ప్రతినిధి శ్రీకాంత్ పసుపు సాగుపై పవర్ పాయింట్ ద్వారా అవగాహన కల్పించారు. గిరిజన రైతులకు పసుపు సాగులో సలహాలు, సూచనలు ఇచ్చేందుకు ప్రత్యేక వ్యవస్థను సిద్ధం చేశామన్నారు. రైతులు వాట్సాప్ ద్వారా వాయిస్ మెసేజ్, సంక్షిప్త సమాచారం ద్వారా అడిగే ప్రశ్నలకు సమాధానం ఇస్తామన్నారు. రైతులు సంప్రదించాల్సిన నంబర్‌ను ఉద్యాన, వ్యవసాయశాఖ క్షేత్ర స్థాయి ఉద్యోగుల ద్వారా తీసుకోచ్చునన్నారు. రైతులు పండించిన పసుపు ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్త చెట్టి బిందు, చింతపల్లి ఉద్యాన శాఖ అధికారి కంటా బాలకర్ణ, భూసార పరీక్ష ఏవో శోభ, వ్యవసాయ అధికారులు శ్రీనివాసరావు, మధుసూదనరావు, జీకే వీధి, కొయ్యూరు, చింతపల్లి, జి.మాడుగుల వ్యవసాయ, ఉద్యాన శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.



మోదకొండమ్మ ఆలయ ప్రాంగణంలో సీఈవోను సన్మానిస్తున్న ఎంపీడీవోలు

పంచాయతీల అభివృద్ధిపై దృష్టిసారించాలి

పాడేరు రూరల్, జూలై 6: పంచాయతీల అభివృద్ధిపై ఎంపీడీవోలు దృష్టిసారించాలని జడ్పీ సీఈవో ఎం.పోలినాయుడు ఆదేశించారు. శనివారం పాడేరు వచ్చిన ఆయన ముందుగా ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్యదైవం మోదకొండమ్మను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో పాడేరు ఎంపీడీవో కె.సాయినవీన్ ఆధ్వర్యంలో ఎంపీడీవోలు సీఈవోను శాలువతో సత్కరించి అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయానికి చేరుకున్న ఆయన డివిజన్ పరిధిలోని 11 మండలాల ఎంపీడీవోలతో బ్లాక్ ప్లానింగ్ పంచాయతీ డెవలప్‌మెంట్‌పై సమీక్షించారు. పంచాయతీలు అభివృద్ధికి అవసరమైన చర్యలు చేపట్టాలని ఆయన ఆదేశించారు.

ట్రాక్టర్ ఢీకొని ఒకరి మృతి

కొయ్యూరు, జూలై 6: ట్రాక్టర్ వెనక్కి రావడంతో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందాడు. కొయ్యూరు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపిన వివరాలిలా వున్నాయి. రత్నంపేట పంచాయతీ పాడి గ్రామానికి చెవ్వాకుల చంటిబాబు దుక్కి సెట్‌తో ట్రాక్టర్‌ను గురువారం రాత్రి తీసుకువెళుతున్నాడు. చంటిబాబు ట్రాక్టర్ నడుపుతుండగా అతని అన్నయ్య అప్పారావు (40) వెనుక వాహనంపై వెళ్లాడు. పాడి గ్రామం చేరుకునే సరికి ట్రాక్టర్‌కు అమర్చిన దుక్కిసెట్ రాడ్ ఊడిపోవడంతో దానిని గమనించిన అప్పారావు ట్రాక్టర్ ఆపించి రాడ్ సరిచేస్తున్నాడు. ఇంతలో చంటిబాబు రివర్స్ గేర్ వేయడంతో ట్రాక్టర్ వెనక్కి వచ్చి అప్పారావు గాయపడ్డాడు. స్థానిక పీహెచ్‌సీలో ప్రథమ చికిత్స అనంతరం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల ఆకస్మిక తనిఖీలు

కొయ్యూరు, జూలై 6: మండలంలోని యు.చీడిపాలెం పంచాయతీ పెదలంక చిన కొత్తూరు, పుట్టకోట, కొత్తూరు తదితర మారుమూల కొండలపైన అంగన్‌వాడీ కేంద్రాలను సీడీపీవో విజయలక్ష్మి శనివారం తనిఖీలు చేశారు. గర్భిణులు, బాలింతలను పరామర్శించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందించే పౌష్టికాహారంపై ఆరా తీశారు. సీజనల్‌గా వచ్చే వ్యాధులపై దృష్టిసారించాలి. ఈ పర్యటనలో సూపర్‌వైజర్ మహాలక్ష్మి, మహిళా పోలీసు గంగా భవాని, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటండి

» ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి అభిషేక్

» స్వర్ణాలు సాధించిన మారథాన్ క్రీడాకారులకు అభినందనలు



క్రీడాకారులకు మెడల్స్, ప్రశంసాపత్రాలు అందించిన ఐటీడీఏ పీవో అభిషేక్

అరకులోయ, జూలై 6: అంతర్జాతీయ మారథాన్ పోటీలలో తమ సత్తా చాటాలని, ఇందుకు ఐటీడీఏ ప్రోత్సాహం అందిస్తుందని ఐటీడీఏ పీవో అభిషేక్ అన్నారు. ఉత్తరప్రదేశ్‌లోని వారణాసిలో ఇటీవల నేషనల్ చాంపియన్‌షిప్-2024 మారథాన్ పోటీలు జరిగాయి. ఈ పోటీలలో పాల్గొనేందుకు అరకులోయ, అనంతగిరి మండలాల పరిధిలో నుంచి ముగ్గురు క్రీడాకారులు పాల్గొని వారి ప్రతిభను కనబరచి స్వర్ణాలను గెలుపొందారు. ఈ పోటీలలో పాల్గొనేందుకు ఐటీడీఏ పీవో ప్రత్యేక చొరవ తీసుకొని అవసరమైన ఆర్థిక సాయాన్ని అందించి ప్రోత్సహించారు. ఈ సందర్భంగా పది కిలోమీటర్ల పరుగు పందెంలో ప్రథమ స్థానంలో నిలిచి స్వర్ణ పతకాన్ని సొంతం చేసుకున్న పెదలబుడు పంచాయతీ గరడగుడ గ్రామానికి చెందిన కిల్లో బుద్దు, ఐదు కిలోమీటర్ల పరుగు పందెంలో ప్రథమ స్థానంలో నిలిచిన స్వర్ణం సాధించిన అనంతగిరి మండలం కొత్తూరు పంచాయతీ తుమ్మానువలస గ్రామానికి చెందిన కొర్రా గోపీ శుక్రవారం ఐటీడీఏ పీవో అభిషేక్‌ను కలిశారు. ఇరువురు మారథాన్ క్రీడాకారులను పీవో అభినందించారు. అంతర్జాతీయ పోటీల్లో స్వర్ణ పతకాలను సాధించాలని ఈ సందర్భంగా పీవో ఆకాంక్షించారు.

కుక్కలకు ర్యాబిస్ టీకాలు వేయించండి

» జిల్లా రెవెన్యూ అధికారి పద్మావతి



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఆర్వో పద్మావతి

పాడేరు రూరల్, జూలై 6: జిల్లాలోని కుక్కల పెంపకం యజమానులు వ్యాధి నివారణ టీకాల (ర్యాబిస్ టీకాలు)ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి బి.పద్మావతి కోరారు. అంతర్జాతీయ జోనోసిస్ దినోత్సవం సందర్భంగా ప్రాంతీయ పశువైద్యశాలలో శనివారం ఏర్పాటు చేసిన టీకాల శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఆమె మాట్లాడుతూ కుక్కల ప్రేమికులు, వాటిని కుటుంబ సభ్యులతో సమానంగా పెంచుకొనే యజమానులు వ్యాధులను నివారించుకొనేందుకు తగిన జాగ్రత్తలను చేపడతారన్నారు. జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి సిహెచ్.నరసింహులు మాట్లాడుతూ జిల్లాలోని 22 మండలాల్లో తొమ్మిది ప్రాంతీయ పశు వైద్యశాలలు, 41 పశువైద్య కేంద్రాలు, 20 గ్రామీణ పశువైద్య కేంద్రాలు, 277 రైతు సేవా కేంద్రాల పరిధిలో ఉన్న సుమారు 15,600 పెంపుడు కుక్కలకు ఉచిత వ్యాధి నివారణ టీకాలు వేసేందుకు చర్యలు చేపట్టారన్నారు. జిల్లా వ్యాప్తంగా శనివారం 9,500 కుక్కలకు టీకాలు వేశామన్నారు. మండలంలో 256 పెంపుడు కుక్కలు ఉండగా మొదటి రోజు 159 కుక్కలకు టీకాలను వేశామన్నారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్లు సిహెచ్.చంద్రశేఖర్, లైవ్ స్టాక్ అసిస్టెంట్స్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి షేక్.జమీల్ బాషా పశుసంవర్ధక శాఖ సహాయకులు పాల్గొన్నారు.

జిల్లా వ్యాప్తంగా 15,600 పెంపుడు కుక్కలు ఉండగా మొదటి రోజు శనివారం 9,500 కుక్కలకు వ్యాధి నిరోధక టీకాలు అందించామని జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి సిహెచ్.నర్సింహులు తెలిపారు.

☛ సంక్షిప్తంగా..

ప్రతీ పని దినం ఫిర్యాదుల స్వీకరణ

» తహసీల్దార్ రామకృష్ణ

చింతపల్లి, జూలై 6: రెవెన్యూ కార్యాలయంలో ప్రతీ పని దినం ఫిర్యాదులు స్వీకరిస్తామని తహసీల్దార్ టి.రామకృష్ణ తెలిపారు. రెవెన్యూ కార్యాలయంలో శనివారం వీఆర్వోలతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. ప్రజలు రెవెన్యూ కార్యాలయానికి వచ్చి వివిధ సమస్యలపై ఫిర్యాదు చేయవచ్చునన్నారు. ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. మీకోసం కార్యక్రమంపై గ్రామాల్లో వీఆర్వో, వీఆర్‌ఏలు ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే గ్రామాల్లో ఎండీఎం ఆపరేటర్లు రేషన్ సరకులు గృహాలకు వెళ్లి పంపిణీ చేయాలన్నారు.

ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి

చింతపల్లి, జూలై 6: గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలల వసతిగృహాల్లో విద్యార్థినులు ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి తాజంగి వైద్యాధికారి జి.భవాని సూచించారు. వంగసార ఆశ్రమ పాఠశాలలో శనివారం ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటుచేసి విద్యార్థినులకు ఆరోగ్య తనిఖీలు నిర్వహించారు. వాతావరణంలో మార్పుల వల్ల జ్వరాలు, దగ్గు, జలుబు, గొంతునొప్పి, అతిసార ప్రబలే ప్రమాదం ఉందని, విద్యార్థినుల్లో వ్యాధి లక్షణాలు కనిపిస్తేవెంటనే తమకు తెలపాలని ఈ సందర్భంగా ఆమె చెప్పారు. వ్యాధులపై అశ్రద్ధ చేయవద్దని, విద్యార్థినుల ఆరోగ్యంపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని చెప్పారు. పీజీ హెచ్ఎం ప్రసాదరావు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం

కొయ్యూరు, జూలై 6: ప్రధానమంత్రి ఆది అవాస్ యోజన పథకంలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తామని ఎంపీడీవో లాలం సీతయ్య తెలిపారు. అంతాడ పంచాయతీలో సర్పంచ్ చంద్రరావు అధ్యక్షతన శనివారం నిర్వహించిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. ఈ పథకంలో కొయ్యూరు, రాజేంద్రపాలెం, అంతాడ, మంప, నడింపాలెం, చింతలపూడి, రావణాపల్లి ఆడాకుల పంచాయతీలను ఎంపిక చేసినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏస్ కార్యదర్శి మల్లికార్జుననాయక్, నవనిర్మాణ సమితి ప్రతినిధి వి.కుమార్, ఎంపీటీసీ సభ్యురాలు సత్యవాణి, ఉప సర్పంచ్ రాజులమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు, సచివాలయ ఉద్యోగులు, ప్రజలు పాల్గొన్నారు.

సీలేరుకు నిలిచిన విద్యుత్ సరఫరా

సీలేరు, జూలై 6: సీలేరులో విద్యుత్ లైన్‌పై కోతి పడడంతో మూడు గంటల పాటు సరఫరా నిలిచిపోయింది. సీలేరు జల విద్యుత్ కేంద్రం వెనుక గల స్విచ్ యార్డులోని 33 కేవీ లైన్‌పై శనివారం ఉదయం ఆరు గంటల సమయంలో కోతి పడి విద్యుత్ లైన్ షార్ట్‌సర్క్యూట్ అయింది. ఏపీ జెన్‌కో సిబ్బంది స్విచ్ యార్డుకు చేరుకుని 33 కేవీ లైన్‌ను పరిశీలించగా జంపర్ కాలిపోయినట్టు గుర్తించారు. దీంతో జంపర్‌ను మార్చి ఉదయం తొమ్మిది గంటలకు సీలేరు గ్రామానికి విద్యుత్‌ను పునరుద్ధరించారు.

తాగునీటి పథకం ప్రారంభం

జి.మాడుగుల, జూలై 6: నుర్మతి అవుట్‌పోస్టు సమీపంలోని బొయితిలి పంచాయతీ సిరసపల్లి, జీరుగుల గొయ్యి గ్రామాల గిరిజనుల తాగునీటి అవసరాల కోసం నిర్మించిన రక్షిత నీటి పథకాన్ని పోలీసులు శనివారం ప్రారంభించారు. అలాగే గిరిజనులు ఉద్యానవన పంటలకు ప్రోత్సహించే లక్ష్యంగా సిల్వర్ ఓక్ మొక్కలు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీఆర్‌పీఎఫ్ కమాండెంట్ రాజేశ్‌పాండే, సీఐ రమేశ్‌కుమార్ మాట్లాడుతూ గిరిజనులకు ఏ సమస్య తలెత్తినా తమ దృష్టికి తీసుకువస్తే తక్షణమే పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌పీఎఫ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కార్మిక దినోత్సవాన్ని జయప్రదం చేయాలి

గూడెంకొత్తవీధి, జూలై 6: దేశ వ్యాప్తంగా ఈ నెల 10న జరగనున్న కార్మికుల దినోత్సవాన్ని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బోనంగి చిన్నయ్య పడాల్ పిలుపునిచ్చారు. మండలంలోని ముక్కుమెట్ట గ్రామంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాసే లేబర్ కోడ్‌ను అమలు చేస్తుందన్నారు. దీన్ని కార్మికులంతా ఐక్యంగా వ్యతిరేకించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు అప్పలనరస, సత్యనారాయణ, సావిత్రి, మీనాక్షి పాల్గొన్నారు.

జల సంరక్షణపై అవగాహన ర్యాలీ

అరకులోయ, జూలై 6: మండల కేంద్రంలో జల సంరక్షణపై శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామకృష్ణ మాట్లాడుతూ జల సంరక్షణకు ఇంకుడు గుంతను సిద్ధం చేయాలని సూచించారు. అలాగే జల సంరక్షణ చేపట్టే విధానాన్ని వివరించారు. వృథా నీటిని ఇంకుడు గుంతలతో భూగర్భంలోకి పంపితే భూగర్భ జలాల మట్టాలు పెరుగుతాయని చెప్పారు. గ్రామాల్లో ఇంకుడు గుంతలు ఏర్పాటుచేసేలా అవగాహన కల్పించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని వైస్ ప్రిన్సిపాల్ చలపతి చెప్పారు. అంతకు ముందు జల సంరక్షణపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

కాంట్రాక్టు అధ్యాపకుల రెన్యువల్‌కు దరఖాస్తుల ఆహ్వానం

పాడేరు రూరల్, జూలై 6: పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల కాంట్రాక్టు అధ్యాపకులను 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి రెన్యువల్ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ వి.చిట్టిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. సీసీఈ వారు జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారం జిల్లాలో డిగ్రీ కళాశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులను మాత్రమే రెన్యువల్ చేస్తున్నారన్నారు. ఈ రెన్యువల్‌కు 2023-24 విద్యా సంవత్సరంలో పనిచేసిన ఒప్పంద అధ్యాపకులు మాత్రమే అర్హులన్నారు. ఆసక్తి గల అధ్యాపకులు ఈ నెల 9వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

బెయిల్‌పై వచ్చి చంపేశాడు

... 5వ పేజీ తరువాయి

మాదిరిగానే శనివారం పాఠశాలకు వెళ్లిన బాలిక సాయంత్రం ఐదు గంటల ప్రాంతంలో ఇంటికి చేరుకుంది. ఆ సమయానికి తల్లిదండ్రులు ఇంకా ఇంటికి రాలేదు. నాయనమ్మ ఉన్నప్పటికీ బయటకు వెళ్లింది. దీంతో ఆమె పుస్తకాల బ్యాగ్ బయట ఉన్న టేబుల్‌పై పెట్టి స్నానం చేసేందుకు ఇంట్లోకి వెళ్లింది. అయితే అప్పటికే సురేశ్ లోపల మాటు వేసి ఉన్నాడు. ఆమె ఇంట్లోకి వెళ్లగానే సురేశ్ తలుపులు వేసి ఆమెను కత్తితో అతి దారుణంగా హత్య చేశాడు. ఈలోగా బాలిక నాయనమ్మ ఇంటికి వచ్చింది. తలుపులు వేసి ఉండడంతో వాటిని తట్టింది. లోపల ఉన్న సురేశ్ తలుపు తీసి ఆమెను తోసేసి పారిపోయాడు. అనంతరం ఇంట్లోకి వెళ్లిన ఆమె మనుమరాలు రక్తపు మడుగులో విగతజీవిలా మనవరాలు పడి ఉండడాన్ని చూసి కన్నీరుమున్నీరుగా విలపిస్తూ కుటుంబ సభ్యులకు విషయం తెలియజేసింది. సమాచారం అందుకున్న పరవాడ డీఎస్పీ సత్యనారాయణ, రాంబిల్లి, అచ్యుతాపురం సీఐలు నరసింగరావు, బుచ్చిరాజు సిబ్బందితో వచ్చి బాలిక మృతదేహాన్ని పరిశీలించి, విచారణ జరిపారు. క్లూస్ టీమ్ చేరుకుని వేలి ముద్రలను సేకరించింది.

సురేశ్‌పై బాలిక తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు, త్వరలోనే నిందితుడిని పట్టుకుంటామని డీఎస్పీ సత్యనారాయణ వెల్లడించారు.

‘గంజాయి కంపు’ వదిలేనా..?

... 5వ పేజీ తరువాయి

చేపడుతున్న పోలీసుల తనిఖీలు, చెక్‌పోస్టులు ఎలా దాటుతున్నాదనేది గమనించాల్సిన విషయం.

మన్యంలో గంజాయి సాగు లేదట..?

ప్రస్తుతం విశాఖ మన్యంలో గంజాయి సాగు లేదని పోలీస్, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు అంటున్నారు. ఈ ఏడాది నిర్వహించిన సర్వేలో ఏజెన్సీలో 600 ఎకరాల్లో గంజాయి తోటలున్నట్టు గుర్తించి, వాటిని పోలీసులు నాశనం చేశారట. దీంతో ఏజెన్సీలో ప్రస్తుతం ఎక్కడ కూడా గంజాయి తోటలు లేవని అంటున్నారు. ప్రస్తుతం ఏజెన్సీకి ఆనుకుని ఉన్న ఒడిశా రాష్ట్రం మల్కన్‌గిరి జిల్లాలో అధిక విస్తీర్ణంలో గంజాయి సాగు చేసి ఏజెన్సీ మీదుగా ఇతర ప్రాంతాలకు అక్రమ రవాణా చేస్తున్నారని పోలీసులు పేర్కొంటున్నారు. ఇదిలా ఉండగా గంజాయిని నిర్మూలించేందుకు ప్రత్యేక చర్యలు చేపడతామని హోం మంత్రి అనిత ప్రకటించడం, గంజాయిపై వాస్తవాలను తెలుసుకోవడంతో పాటు, భవిష్యత్తు కార్యాచరణ కోసం మంత్రుల కమిటీని ఏర్పాటు చేయడంతో రాష్ట్రంలో అందరి దృష్టికి గంజాయి, దానికి కేంద్రమైన మన్యంపై పడింది. ఈ క్రమంలో గంజాయి నిర్మూలనకు ప్రభుత్వం ఎటువంటి చర్యలు చేపడుతుందోననేది చర్చనీయాంశమైంది.

ముంచంగిపుట్టును వీడని వర్షం

ఉధృతంగా ప్రవహిస్తున్న గెడ్డలు

» కొట్టుకుపోయిన మట్టి రహదారులు

» అష్టకష్టాలు పడుతున్న గిరిజనులు

» పలు గ్రామాలకు స్తంభించిన రాకపోకలు



దొరగూడ సమీపంలో కర్రల సాయంతో ద్విచక్ర వాహనాన్ని గెడ్డ దాటిస్తున్న దృశ్యం

ముంచంగిపుట్టు, జూలై 6: ముంచంగిపుట్టు మండలాన్ని వర్షం వీడడం లేదు. గత కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని లక్ష్మీపురం పంచాయతీలో మత్స్యగెడ్డ పాయలు వరద నీటితో ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఈ కారణంగా పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఆ పంచాయతీ పరిధిలో గల బీరుగూడ, కర్లాపొదర్, దొరగూడ, ఉబ్బెంగుల తదితర ప్రాంతాల్లో మత్స్యగెడ్డ పాయలు వరదనీటితో ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. వరదనీటి ఉధృతికి బీరుగూడ సమీపంలో మత్స్యగెడ్డ పాయపై చేపడుతున్న వంతెన ఇరువైపులా ముందు భాగం కోతకు గురైంది. దీంతో ఆంధ్రా, ఒడిశా ప్రాంతాలకు చెందిన సుమారు 25 గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించేందుకు అవరోధం ఏర్పడింది. గెడ్డలు ఉధృతంగా ప్రవహించడంతో గెడ్డ అవతల ప్రజలు బిక్కుబిక్కుమంటూ జీవిస్తున్నారు. దొరగూడ సమీపంలో మత్స్యగెడ్డ ఉధృతంగా ప్రవహించడంతో అత్యవసర సమయాల్లో ద్విచక్ర వాహనాలకు కర్రలను కట్టి గెడ్డ దాటించాల్సిన పరిస్థితి నెలకొందని ఆ ప్రాంతీయులు తెలిపారు. అలాగే ఆ గ్రామానికి వెళ్లే ఆరు కిలోమీటర్ల మట్టి రహదారి రూపురేఖలు మారిపోవడంతో రాకపోకలు సాగించేందుకు ఆ ప్రాంతీయులు అష్టకష్టాలు పడుతున్నారు. రహదారి పలుచోట్ల కోతకు గురికావడంతోపాటు బురదమయంగా మారిపోయింది. ప్రస్తుతం వాహన రాకపోకలు జరగడం లేదు. ఏ చిన్నపాటి అవసరానికైనా పంచాయతీ, మండల కేంద్రాలకు వచ్చేందుకు ఆ ప్రాంతీయులు కాలినడక ఆరు కిలోమీటర్లు నడిచి ప్రధాన రహదారి వద్దకు చేరుకుంటున్నారు. అధికారులు స్పందించి మత్స్యగెడ్డ పాయలపై కల్వర్టులు, వంతెనలు నిర్మించాలని, పక్కా రహదారులు నిర్మించాలని ఆ ప్రాంతీయులు కోరుతున్నారు.

జిప్‌లైన్ వివాదం

... 5వ పేజీ తరువాయి

పంచాయతీకి 20 శాతం ఆదాయాన్ని ఇవ్వాలని వారు స్పష్టం చేస్తున్నారు. అలాగే శ్రీశైలంలో రోప్‌వే నిర్వహించిన విధంగా ఇక్కడ జిప్‌లైన్‌ను నిర్వహించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అదేవిధంగా ఐటీడీఏ ఆధ్వర్యంలో అరకులోయ మ్యూజియం ప్రాంగణంలో, లంబసింగి సమీపంలో తాజంగి వద్ద జిప్‌లైన్‌ను నిర్వహిస్తున్నారని ఈ సందర్భంగా గుర్తుచేస్తున్నారు. టూరిజం సంస్థ నిర్వహించలేకపోతే నిర్వహణ బాధ్యతను ఐటీడీఏకు అప్పగించాలే తప్ప గిరిజన చట్టాలకు, నిబంధనలకు వ్యతిరేకంగా ప్రైవేటు వ్యక్తులకు అప్పగిస్తే వ్యతిరేకిస్తామని స్థానిక గిరిజన సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు స్పష్టం చేస్తున్నాయి.